సాక్షి
తిరుపతి
సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



కాణిపాకం కిటకిట

కాణిపాకం(యాదమరి):కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి ఉదయం నుంచే భక్తుల తాకిడి మొదలైంది.



తిరుమలలో వర్షం

తిరుమల : తిరుమలలో ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి వర్షం పడింది. సుమారు అర్ధగంట పాటు వర్షం కురవడంతో భక్తులు తడిసి ముద్దయ్యారు.

అరుదైన సీతాకోక చిలుక



తిరుపతిలోని సుందరయ్యనగర్‌లో ఆదివారం అరుదైన సీతాకోక చిలుక కనువిందు చేసింది. దీన్ని పలువురు ఆసక్తిగా చూడడం కనిపించింది

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం(సా)	సహర్ మంగళవారం(ఉ)
తిరుపతి	6.28	4.47
చిత్తూరు	6.30	4.47
పుంగనూరు	6.32	4.51

న్యూస్‌రీల్

నేటి నుంచి నృసింహుని వసంతోత్సవాలు



పెంచలకోన ఆలయం

రాపూరు : పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం నుంచి వసంతోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పాంచ రాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం వసంత రుతువులో శ్రీవారికి వసంతోత్సవాలు నిర్వహించడం ఆచారమని తెలిపారు. ఈ మేరకు 3 నుంచి 6వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని వెల్లడించారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. స్పందనకు తప్పనిసరిగా అన్నిశాఖల జిల్లా అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ సాయంత్రం స్పందన వినతులు స్వీకరించాలని స్పష్టం చేశారు.

5న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు


తిరుపతి అర్బన్: తమిళనాడులోని తిరువణ్ణామలైకు బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని తిరుపతి నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన ఉదయం 6 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రతి 30 నిముషాలకు ఒక సర్వీస్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. టికెట్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపా రు. వివరాలకు 9959225684, 9959225686 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ఆదాయంలో తిరుపతి జిల్లా ఫస్ట్

తిరుపతి అర్బన్: ఆర్టీసీకి జిల్లాల వారీగా లభించిన ఆదాయంలో తిరుపతి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని అధికారులు తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్టీసీ తిరుపతి జిల్లా ఆదాయం రూ.565 కోట్లుగా అధికారులు వెల్లడించారు. 2020–21లో కోవిడ్‌తో ఆర్టీసీకి నష్టాలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత ఆర్టీసీ ఆదాయంతో ముందుకు సాగుతోంది. కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో 11 డిపోలున్నాయి. గత ఏడాది 844 లక్షల కిలోమీటర్ల ఆర్టీసీ సర్వీసులు నడిపించారు. రూ.277.88 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 1,208 లక్షల కిలోమీటర్లు సర్వీసులు తిప్పారు. గతంలో కంటే ఈ ఏడాది ఆదాయం రెట్టింపయ్యింది.

ఫలవంతం.. తొలి వసంతం

తిరుపతి జిల్లా నేటితో తొలి వసంతం పూర్తి చేసుకుంది.. పునర్విభజన లక్ష్యాలను అధిగమిస్తోంది.. ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తోంది.. సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందిస్తోంది.. సుపరిపాలనను ప్రజలకు చేరువచేస్తోంది.. సమస్యల పరిష్కారంలో ముందంజ వేస్తోంది.. పరిశ్రమల స్థాపనకు స్వర్గధామంగా విలసిల్లుతోంది.. పారిశ్రామికాభివృద్ధిలో పురోగమిస్తోంది.. వేలాది మందికి ఉపాధి కేంద్రంగా భాసిల్లుతోంది. భవిష్యత్‌లో రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూర్చే దిశగా దూసుకెళుతోంది.



తిరుపతి జిల్లా స్వరూపం

విస్తీర్ణం	9,174 చ.కి.మీ
మండలాలు	35
గ్రామాలు	1,107
రెవెన్యూ డివిజన్లు	04
పంచాయతీలు	784
అసెంబ్లీ నియోజకవర్గాలు	07
మున్సిపాలిటీలు	05
జనాభా	22.18 లక్షలు
పురుషులు	11.10 లక్షలు
మహిళలు	11.08 లక్షలు
అర్బన్ జనాభా	3.69 లక్షలు
రూరల్ జనాభా	15.04 లక్షలు

- తిరుపతి జిల్లాకు నేటితో ఏడాది
- ప్రజలకు చేరువగా పాలన
- అందుబాటులో ప్రభుత్వ సేవలు
- పారిశ్రామిక ప్రగతి పరుగులు
- వేలాది మందికి ఉద్యోగాలు

సాక్షి, తిరుపతి : ప్రజలకు సులభతరంగా సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పునర్విభజనకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి కేంద్రంగా జిల్లా ఆవిర్భవించింది. 35 మండలాలు, 5 రెవెన్యూ డివిజన్లతో ప్రభుత్వ సేవలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిస్తూ నేటితో విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది.

సులభతరంగా సేవలు

జిల్లా కేంద్రం తిరుపతిలో కలెక్టరేట్‌తోపాటు కీలకమైన 28శాఖల కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. అలాగే ఎక్కడికక్కడ రెవెన్యూ డివిజన్లు చేయడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభతరంగా అందుతున్నాయి. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలవుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఎక్కడ చిన్నపాటి సమస్య తలెత్తినా వెంటనే అధికారులు అక్కడకు చేరుకుని పరిష్కరించే వెసులుబాటు వచ్చింది. ప్రజలకు సైతం దూరాభారం తిరగాల్సిన ఇబ్బంది తప్పింది. జిల్లాస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించే అవకాశం ఏర్పడింది.



భూముల ధరలకు రెక్కలు

కొత్త జిల్లా ఏర్పాటు కావడంతో తిరుపతితోపాటు శ్రీకాళహస్తి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు పరిసర ప్రాంతాలు, మండలాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో రిజిస్ట్రేషన్లశాఖ ఆదాయం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. భవన నిర్మాణ రంగం ఊపందుకోవడంతో పెద్దసంఖ్యలో కార్మికులకు ఉపాధి లభిస్తోంది. అనుబంధ రంగాలపై ఆధారపడిన వారికి సైతం జీవనోపాధి దొరుకుతోంది.

శరవేగంగా పారిశ్రామికాభివృద్ధి

తిరుపతి జిల్లా పరిధిలో శ్రీసిటీ, మేనకూరు, గాజులమండ్యం సెజ్‌లు ఉన్నాయి. వీటికి జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. నూతనంగా పరిశ్రమలు స్థాపించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్దసంఖ్యలో వస్తున్నారు. అలాగే తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో భారీగా కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి.

“

పారదర్శకంగా పాలన



తిరుపతి జిల్లా ఏర్పాటుతో పాలన సులభతరంగా మారింది. జిల్లా ఏర్పాటై నేటికి ఏడాది కావడం ఆనందంగా ఉంది.. ప్రజలకు పారదర్శకంగా పాలన అందిస్తున్నాం. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. జిల్లా పరిధి తగ్గడంతో క్షేత్రస్థాయిలో పర్యటన చేసేందుకు సులువుగా ఉంది. వారంలో రెండు, మూడు పర్యాయాలు మండలాల్లో తిరుగుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా.. అనే విషయాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించింది.

– వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

సమయం.. డబ్బు ఆదా



మాకు వారసత్వంగా వచ్చిన భూమి ఆక్రమణకు గురైంది. దీనిపై అప్పట్లో తిరుపతి ఆర్డీఓ కోర్టును ఆశ్రయించా. దాదాపు 16 ఏళ్లపాటు చిత్తూరు కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశా. అక్కడ చాలా కేసులు పెండింగ్‌లో ఉండడంతో నా సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. వేలాది రూపాయలు ఖర్చు అయినా ప్రయోజనం లేదు. తిరుపతి జిల్లా ఏర్పడడంతో శ్రీకాళహస్తిలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటైంది. ఇప్పుడు విచారణ దాదాపు పూర్తయింది. కొద్దిరోజుల్లోనే తీర్పు వెలువడనుంది. డబ్బు, సమయం ఆదా అవుతోంది. నాకు న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది.

– మునస్వామియాదవ్, కోటమంగాపురం, కేవీబీపురం మండలం

నేటి నుంచి శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు



స్వాగతం పలుకుతున్న వసంతోత్సవ మండపం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏటా చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం ఉదయం 7 గంటలకు శ్రీదేవి,భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామివారు నాలుగు మాడ వీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు. రెండోరోజు 4న దేవేరుల సమేత స్వామివారు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతారు. చివరిరోజు 5న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారితో పాటుగా సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లు, రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవంలో పాల్గొని తిరిగి సాయంత్రం ఆలయానికి చేరుకుంటారు. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని 4న అష్టదళ పాదపద్మారాధన, సోమవారం నుంచి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.



మండపాన్ని విశేషంగా అలంకరిస్తున్న సిబ్బంది

జగనన్న వెంటే జనం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసిన మంత్రి రోజా



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- చంద్రబాబు కుతంత్రాలు పనిచేయవు
- 'జగనన్నే మా భవిష్యత్'లో మంత్రి ఆర్కే రోజా

నగరి: రాష్ట్ర ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు కుతంత్రాలు ఏవీ పనిచేయవని, టీడీపీ ఆరిపోయే దీపమని పేర్కొన్నారు. నగరిలోని ఏజేఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ×జగనన్నే మా భవిష్యత్తు× కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ నేడు రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉందంటే అది కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కారణమన్నారు. జగనన్న లాంటి వ్యక్తి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల అదృష్టమన్నారు. ప్రజల మన్ననలు పొందిన ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత వారికన్నా మరింత ప్రజాభిమానాన్ని పొందిన ఏకైక ప్రజానాయకుడు జగనన్నే అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేసి, ఆ తర్వాత దానిని పక్కకు పడేస్తాయని చెప్పారు. అయితే జగనన్న మాత్రం తాను విడుదల చేసిన మేనిఫెస్టోని పవిత్ర గ్రంథంలా భావించి 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటిని ప్రజలకు అందించడం అందరినీ ఆశ్చర్యపరిచే అంశమన్నారు. ఇలాంటి మనసున్న, ధైర్యవంతుడైన సీఎంను మనం మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

అభివృద్ధి పనులు మంజూరు

నగరిలో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మొక్కల కండ్రిగ ప్రాజెక్టును రెండేళ్ల పాటు శ్రమించి సాధించానని మంత్రి స్పష్టం చేశారు. సర్వే జరుగుతోందని, త్వరలోనే ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. మున్సిపాలిటీలో ఒక పార్కును సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టీటీడీ కల్యాణ మండపాన్ని బుగ్గ అగ్రహారం వద్ద నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధమైనట్లు వివరించారు. ఎలక్ట్రికల్ బర్నింగ్ శ్మశాన వాటికను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇలా అన్ని వర్గాల వారికి సంక్షేమం, అభివృద్ధి పనులు చేస్తున్న వైఎస్సార్‌సీపీ వెంటే ప్రజలు ఉన్నారని చెప్పడం అతిశయోక్తి కాదన్నారు. రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, శంకర్, జయప్రకాష్, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

తిరుత్సవం... మహోత్సవం

- తిరుపతి ఐఐటీలో ముగిసిన తిరుత్సవ-2023
- కల్చరల్ ఫెస్ట్‌లో విద్యార్థుల సంబరాలు
- హుషారెత్తించిన డీజే నృత్యాలు
- మూడు రోజుల వేడుకతో ఫుల్‌జోష్



ఉత్సాహంగా సాగుతున్న డీజే నైనాసూర్తే ప్రదర్శన



కేటీఎం బైక్ షోలో సాహసోపేత విన్యాసాలు



కన్నన్ మెంటర్ షో

ఏర్పేడు/ రేణిగుంట: ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో మూడురోజులుగా నిర్వహిస్తున్న తిరుత్సవ-2023 వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ పర్యవేక్షణలో సంబరాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఆఖరి రోజు నిర్వహించిన ఏస్ ఆఫ్ బార్డర్ ల్యాండ్ ఫైనల్స్, కేబీసీ షో, సరికొత్త ఆవిష్కరణల ఈవెంట్ ఐడియాథాన్, జనరల్ క్విజ్, స్పిన్ ఏ యార్న్, కేటీఎం బైక్ షో కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అలరించిన బైక్ షో

ఐఐటీ ప్రాంగణంలో ప్రదర్శించిన కేటీఎం బైక్‌షో విన్యాసాలు వీక్షకులను అలరించాయి. స్టంట్ ఫీట్లు చేస్తున్నవారిని విద్యార్థులు కరతాళధ్వనులతో ప్రోత్సహించారు. జనరల్ క్విజ్ రసవత్తరంగా జరిగింది. వర్క్‌షాపుల్లో పాల్గొన్న ఇంజినీరింగ్ విద్యార్థులకు నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేసేందుకు పలు సూచనలు, విలువైన సమాచారం అందించారు. క్యాంపస్ అంతటా విభిన్న చిత్రాలు, పోస్టర్లను ఐఐటీ విద్యార్థులు ప్రదర్శించారు. రాత్రి కన్నన్ మెంటర్ షో ఆకట్టుకుంది.

ఫుల్ జోష్‌తో డీజే నృత్యాలు

ప్రఖ్యాత డీజే నృత్యకారిణి, మ్యూజిక్ ఆర్టిస్ట్ నైనా సూర్తె బృందంచే ప్రదర్శితమైన డీజే నృత్యాలు ముగింపు ఉత్సవ శోభను రెట్టింపు చేశాయి. ఐఐటీ విద్యార్థులు స్టేజ్ ముందు నృత్యాలు చేసి, పాటలకు అనుగుణంగా చప్పట్లు, కేరింతలతో వేడుకలకు ముగింపు పలికారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ వెలుగులు, హుషారెత్తించే మ్యూజికల్ సౌండ్స్, పాప్ గీతాలకు సుమారు రెండు గంటలకు పైగా నృత్యాలు చేస్తూ తిరుత్సవ-2023 సంబరాలను పరిపూర్ణం చేశారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు



మాట్లాడుతున్న మువ్వా రామలింగం, పక్కన డీఈఓ శేఖర్

తిరుపతి ఎడ్యుకేషన్ : పదోతరగతి పరీక్షలను సోమవారం నుంచి పకడ్బందీగా నిర్వహించనున్నట్లు ఎగ్జామ్స్ అబ్జర్వర్ మువ్వా రామలింగం తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో జిల్లాలోని 27 'సీ' పరీక్ష కేంద్రాల కస్టోడియన్లు, పోలీసు, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొత్తం 152 కేంద్రాల్లో 25,412 మంది ప్రైవేట్, రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అయితే విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచే ఎగ్జామ్ సెంటర్‌లోకి అనుమతిస్తామని తెలిపారు. సకాలంలో విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులతోపాటు సిబ్బంది సైతం సెల్‌ఫోన్ తీసుకెళ్లకూడదని స్పష్టం చేశారు. హాల్ టికెట్లు, రైటింగ్ ప్యాడ్లు, వాటర్ బాటిల్, జామెంటరీ బాక్సుల మినహా ఇతర వస్తువులను అనుమతించమని వెల్లడించారు. పరీక్ష కేంద్రాలున్న పాఠశాలలకు పూర్తిగా సెలవులు ప్రకటించామన్నారు. పరీక్ష లేని రోజుల్లో పాఠశాల నిర్వహించుకోవచ్చని సూచించారు. అలాగే ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో స్పాట్ వాల్యుయేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈఓ వి.శేఖర్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువు ఆక్రమణకు యత్నం



చెరువుకట్టను తవ్వేసిన దృశ్యం

పెళ్లకూరు: మండలంలోని అనకవోలు పంచాయతీలో ఉన్న వెంకటరాయగుంట చెరువును ఆక్రమించుకునేందుకు టీడీపీ నేతలు ఆదివారం యత్నించారు. పెరుమాళ్లపల్లె, గురప్పనాయుడు కండ్రికకు చెందిన టీడీపీ నేతలు సర్వే నంబరు 207లో సుమారు 10ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువుకు కట్టను జేసీబీతో తొలగిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనిపై సర్పంచ్ చెంచురామయ్య సమాచారం అందించడంతో వీఆర్ఏ సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని యంత్రాలను నిలిపేశారు. ఆక్రమణపై విచారించి తగు చర్య లు చేపడుతామని తహసీల్దార్ రామయ్య తెలిపారు.

తుంబురుతీర్థ ముక్కోటికి ముమ్మర ఏర్పాట్లు

తిరుమల : తుంబురు తీర్థ ముక్కోటి ఉత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ వెల్లడించింది. ఇందులో పాల్గొనేందుకు ఈ నెల 5న ఉదయం 6 నుంచి సాయంత్రం 5గంటల వరకు, 6వ తేదీ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు భక్తులను అనుమతించనున్నట్లు పేర్కొంది. ఈ క్రమంలో పాపవినాశనం డ్యామ్ వద్ద భక్తులకు అల్పాహారం, అన్నప్రాదాలు, తాగునీరు అందించనున్నట్లు తెలిపింది. తీర్థానికి చేరుకునేందుకు ఎక్కువ దూరం నడవాల్సి ఉన్నందున గుండె, శ్వాసకోశ సమస్యలు, స్థూలకాయం ఉన్నవారిని అనుమతించమని స్పష్టం చేసింది. పోలీసులు, అటవీశాఖ, టీటీడీ విజిలెన్స్ సమన్వయంతో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు వివరించింది.

'అదనపు' ఆనందం

- ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం
- రెండు నుంచి ఐదు ఇంక్రిమెంట్లకు పెంపు
- ఐదు గ్రేడ్లుగా మార్పు

తిరుపతి అర్బన్: అప్పుల ఊబిలో కునారిల్లుతున్న ఆర్టీసీని ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. అందులో భాగంగా సర్కారులో విలీనం చేసి ముందడుగు వేసింది. కార్మికులను ఉద్యోగులుగా గుర్తించి సక్రమంగా జీతభత్యాలు అందజేస్తోంది. ఈ క్రమంలో అదనపు ఇంక్రిమెంట్‌లు మంజూరు చేసి అండగా నిలుస్తోంది.

ఇకపై 6 ఏళ్లకే..!

గతంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగం పొందిన తర్వాత గ్రేడ్ -1 కింద 9 ఏళ్లకు ఒక ఇంక్రిమెంట్ ఇచ్చేవాళ్లు. అలాగే 18 ఏళ్లకు గ్రేడ్-2 కింద మరో ఇంక్రిమెంట్ మంజూరు చేసేవాళ్లు. ఈ విషయంలో మార్పులు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇటీవల ఆర్టీసీ ఉద్యోగులు విన్నవించారు. దీనిపై ఆయన స్పందించి మార్పులకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు ఉద్యోగం పొందిన తర్వాత 6 ఏళ్లకే గ్రేడ్-1 కింద తొలి ఇంక్రిమెంట్ అందించాలని ఆదేశించారు. అలాగే 12 ఏళ్లకు గ్రేడ్-2, 18 ఏళ్లకు గ్రేడ్-3, 24 ఏళ్లకు గ్రేడ్-4, 30 ఏళ్లకు గ్రేడ్-5 కింద ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. దీంతో ఒక్కో ఉద్యోగికి ఒక్కో ఇంక్రిమెంట్ కింద రూ.2వేల నుంచి రూ.5వేల వరకు అదనంగా జీతం పెరగనుంది.



తిరుపతి బస్టాండ్

జిల్లా సమాచారం

మొత్తం ఆర్టీసీ డిపోలు	:	11
ఉద్యోగులు	:	4,250 మంది
రోజువారీ ప్రయాణికులు	:	5.5లక్షలు సుమారు
రోజువారీ ఆదాయం	:	రూ.1.50 కోట్లు సుమారు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ఆర్టీసీ ఉద్యోగులకు ఇంక్రిమెంట్ల పెంపు హర్షణీయం. గతంలో కేవలం రెండు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఐదు కావడంతో ఉద్యోగులు ఆనందంగా ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

- చల్లా చంద్రయ్య, వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

చక్కటి నిర్ణయం



ఇంక్రిమెంట్ల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆర్టీసీ ఉద్యోగుల్లో తీవ్రమైన అసంతృప్తి ఉండేది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చక్కటి నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆర్టీసీ సిబ్బందికి ఎంతో లబ్ధి చేకూరుతుంది.

- టి.సత్యనారాయణ, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,820
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,560

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	24
చిత్తూరు	36	24
తిరుమల	33	21
గూడూరు	38	27
నగరి	38	26

శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం పెద్దకొట్టాయి ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా ఆలయ ఆవరణంలోని కోట మండపానికి వేంచేపు చేశారు. అక్కడ మూడు ప్రదక్షిణలు చేసి మండపంలో అధిష్ఠింపజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పెద్దిరాజు, చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న వేదపండితులు

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

సూళ్లూరుపేట రూరల్ : పట్టణం సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి(35) మృతదేహం గుర్తించినట్లు ఆదివారం రైల్వే జీఆర్పీ ఎస్ఐ మాల కొండయ్య తెలిపారు. మృతుడి వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

వెంకటగిరి : పట్టణంలోని పోలిశెట్టిగుంట చెరువులో పడి ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ జిలానీబాషా కథనం మేరకు.. స్థానిక బోప్పాపురం ప్రాంతానికి చెందిన షణ్ముగం (40) శనివారం రాత్రి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. మద్యం మత్తులో చెరువులో దిగి మునిగిపోయి ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి మహిళ..



రాపూరు : మండలంలోని పెనుబర్తి వద్ద ఆదివారం సాయంత్రం బైక్‌పై నుంచి పడి ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. గ్రామానికి చెందిన గుండవోలు లక్ష్మమ్మ(48) భర్త ఆవులయ్యతో కలిసి కూలి పనులకు గోనుపల్లెకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో గంగోజీ అనే మరో కూలీతో కలిసి బైక్‌లో బయలుదేరారు. గ్రామ సమీపంలోకి వచ్చిన తర్వాత బైక్ అదుపుతప్పడంతో కింద పడిపోయారు. లక్ష్మమ్మ తలకు తీవ్రమైన గాయంకావడంతో అక్కడికక్కడే మరణించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ జగన్నాథం తెలిపారు.

కరుడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.25 లక్షల విలువచేసే 513 గ్రాముల బంగారు, 200 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం
- జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న కరుడుగట్టిన నేరస్తుని తిరుపతి క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాకు చెందిన తిరువీధుల మహేష్(33) అంతర్రాష్ట్ర దొంగ. ఇటీవల కాలంలో తిరుపతి జిల్లాలోని తిరుచానూరు, ఎమ్మార్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన తొమ్మిది దొంగతనాల్లో ప్రధాన ముద్దాయి. అతనిపై మన రాష్ట్రంలోనేగాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో సుమారు 200కు పైగా కేసులు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పీడీ యాక్ట్ కూడా నమోదు చేసిఉన్నారు. జైలు శిక్ష అనుభవించి బెయిలుపై బయటకు వచ్చిన మహేష్ దొంగతనాల అలవాటును వదులుకోలేకపోయాడు. సాంకేతిక పరమైన అంశాలను జోడించి రేణిగుంట రోడ్డు, నారాయణాద్రి హాస్పిటల్ వద్ద శనివారం చాకచక్యంగా అరెస్ట్ చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

రూ.25 లక్షలు విలువ చేసే సొత్తు స్వాధీనం

నిందితుని వద్ద సుమారు 513 గ్రాముల బంగారు, 200 గ్రాముల వెండి ఆభరణాలు యమహా వాహనం (ఏపీ -03- బిపి -6114)ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. వేసవి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సుదూర ప్రయాణం చేయవల్సి వచ్చినప్పుడు అవసరమైన ఆభరణాలను ఉంచుకుని మిగిలినవి బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఏదైనా ఊరికి వెళితే ఎల్ (హెచ్ ఎం ఎస్) లాకెడ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కేసులో ప్రతిభ చూపిన అడిషనల్ ఎస్పీ క్రైమ్ విమలాకుమారి, క్రైమ్ డీఎస్పీ సురేష్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, చల్లనిదొర, ఎస్ఐలు రెడ్డెప్ప, సుభాన్‌నాయక్‌లను ఎస్పీ రివార్డులందజేశారు.

అచ్చెరుగొలిపే పచ్చటి 'పుచ్చ'





చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలోని ఓ దుకాణంలో పసుపు రంగులో మెరిసిపోతున్న పుచ్చకాయలు కనిపించాయి. వాకాడు మండలం నలగామల నుంచి పుచ్చకాయల లోడ్ తెప్పిస్తే అందులో రెండు మాత్రం పసుపు పచ్చగా ఉండడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. వాటిని కోస్తే లోపల మామూలు కాయల మాదిరిగా ఎరుపు రంగులో ఉన్నాయి. సహజంగా ఆకుపచ్చగా ఉండే పుచ్చ.. విభిన్నంగా దర్శనమివ్వడంతో పలువురు ఆశ్చర్యపోతున్నారు. - చిట్టమూరు

ఆల్ ది బెస్ట్



విద్యార్థి సైకత శిల్పాన్ని రూపొందిస్తున్న సనత్‌కుమార్

'జీవిత ప్రారంభంలో మొదటిసారి ఎదురయ్యే పదోతరగతి పరీక్షలను విజయవంతంగా రాయాలి. మంచి మార్కులు తేవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లాకు పేరుప్రతిష్టలు తీసుకురావాలి' అనే లక్ష్యంతో తనదైన శైలిలో సైకత శిల్పాన్ని రూపొందించారు శిల్పి మంచాల సనత్‌కుమార్. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో తీర ప్రాంతంలోని ఏరూరు అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో పదో తరగతి పరీక్షకు హాజరై పరీక్ష రాస్తున్నట్టుగా సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా సైకత శిల్పకారుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఆల్‌ది బెస్ట్ తెలియజేశారు. - చిల్లకూరు

స్పెషల్‌డ్రైవ్‌తో ఆర్టీఏ దూకుడు

- డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే చర్యలు
- రికార్డులు లేని వాహనాల సీజ్
- ఏడాదిలో 25,337 కేసులు
- రూ.29.12 కోట్ల జరిమానా వసూలు



వాహన రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీనివాసరావు (ఫైల్)

తిరుపతి మంగళం : నిబంధనలను తుంగలోతొక్కే వాహనదారులపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. రికార్డులు లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేసేస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే జరిమానా విధిస్తున్నారు. ఇందుకోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

రోడ్లపైనే రవాణాశాఖ అధికారులు

జిల్లాలోని తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, గూడూరు, సూళూరుపేట ప్రాంతాల్లో వాహనదారుల రికార్డుల పరిశీలన, రోడ్డు ప్రమాదాల నివారణకు డీటీవో సీతారామిరెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎంవీఐ స్థాయి అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి ఆఖరు వరకు నిబంధనలు అతిక్రమించిన వాహనదారుల నుంచి రూ.29.12కోట్లను జరిమానా రూపంలో వసూలు చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలపై 25,337 కేసులు నమోదు చేశారు.

ప్రాణాపాయంలో సాయం చేస్తే బహుమతి

రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆస్పత్రికి తరలించి కాపాడిన వారికి రూ. 5వేలు బహుమతి అందిస్తున్నట్లు రవాణాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. అలాగే పోలీసులు సైతం వారిని ఇబ్బంది పెట్టకూడదని హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు తెలియజేస్తున్నారు. ఒక వేళ అతను ఇష్టపడి కేసులో సాక్ష్యం చెబుతానని ముందుకు వచ్చినా కోర్టు చుట్టూ తిప్పకుండా ఒక సిట్టింగ్‌లోనే కేసు క్లోజ్ చేయించే వెసులుబాటు కల్పించినట్లు వివరిస్తున్నారు.


ట్యాక్స్ చెల్లింపు తప్పనిసరి



వాహనదారులు రవాణాశాఖకు ట్యాక్స్‌ను తప్పనిసరిగా చెల్లించాలి. లేకుంటే వాహనాలను సీజ్ చేస్తాం. అధిక వేగంతో వాహనం నడిపినా, హెల్మెట్ ధరించకపోయినా, సీటు బెల్ట్ పెట్టుకోకపోయినా చర్యలు తప్పవు. రికార్డులను ఎప్పుడూ వాహనంలో ఉంచుకోవాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే జరిమానా తప్పదు.

- సీతారామిరెడ్డి, డీటీఓ, తిరుపతి

ఫైబర్ నెట్‌తో విస్తృత సేవలు



ఫైబర్‌నెట్ కనెక్షన్‌తో ఇంటర్‌నెట్, టీవీ, ఫోన్ సదుపాయం

చిత్తూరు కార్పొరేషన్: బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్‌తో సేవలను విస్తృతం చేస్తోంది. టీవీ, కంప్యూటర్, ఫోన్ దాదాపు అన్ని ఇళ్లలో ఉన్నాయి. వీటి పరంగా ప్రైవేటు నెట్‌వర్క్‌లు పలు ఆఫర్లు ప్రకటిస్తూ వినియోగదారులను ఆకర్షిస్తోంది. వారికి పోటీగా ఒక కనెక్షన్‌తో బీఎస్ఎన్ఎల్ 3 సేవలను అందిస్తోంది. ఇంటర్‌నెట్, డిష్, ల్యాండ్‌ల్యాన్ సదుపాయం కలిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం కొత్త పథకం ద్వారా 100 సర్వీసులను ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల సమయంలో బీఎస్ఎన్ఎల్ ప్లాన్‌ను తీసుకొని వాటి ద్వారా కంప్యూటర్లకు నెట్ వాడుకున్నారు.

ప్యాకేజీలు ఇలా...

4 జీ స్పీడ్‌తో 1000 జీబీ డేటా 20 ఎంబీపీఎస్‌తో స్పీడ్‌తో ఇంటర్‌నెట్, ఫోన్‌కాల్స్, తెలుగు ఛానల్స్ హెచ్‌డీ సదుపాయంతో నెల రోజులకు ప్లాన్ రూ. 690కు అందుబాటులో ఉంచారు. నెలకు 3,300 జీబీ డేటా 30 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇస్తున్నారు. అదే రూ.599 ప్లాన్‌తో 60 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 3,300 జీబీ డేటా సదుపాయం కల్పించారు. రూ.645 డేటా ప్లాన్‌తో 100 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 3,300 జీబీ డేటా ఇస్తున్నారు. రూ.799 ప్యాక్‌తో 3,300 జీబీ డేటా 100 ఎంబీపీఎస్ స్పీడ్ ఇస్తున్నారు. ఇందులో అదనంగా ఓటీటీలోని సోనిలైవ్, హాట్ స్టార్, జీ ఫైవ్, సినిమాప్లస్ ప్లాట్‌ఫామ్స్ అందిస్తున్నారు. అదే రూ.999 ప్యాక్‌తో 150 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 3,300 జీబీ డేటా, రూ.2299 ప్లాన్‌తో 300 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 4,500 జీబీ డేటాను అందిస్తారు. ఎంపిక చేసుకున్న ప్యాక్‌కు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించి సేవలు పొందవచ్చు. మోడెంకు రూ.3,500 చెల్లించి సేవలు వినియోగించుకోవాలి. అదే రూ.599 ప్యాక్‌ను 6 నెలల రీచార్జ్‌తో మోడెంను ఉచితంగా ఇచ్చే అవకాశం కల్పించారు.

అందుబాటులో...

టీవీకి డిష్, కంప్యూటర్‌కు నెట్, ల్యాండ్‌లైన్ ఇలా 3 రకాల కనెక్షన్లు ఇస్తాం. అలా కాకుండా ఫైబర్ నెట్ తీసుకుంటే ఒకే కనెక్షన్‌తో మూడు సేవలు పొందవచ్చు. రూటర్, మోడెం సదుపాయంతో ఒకే బాక్స్ నుంచి వీటిన్నింటికీ కనెక్షన్ ఇస్తున్నారు. ఉల్కా టీవీ సౌజన్యంతో ఇంటర్‌నెట్ టీవీ సర్వీసులను ప్రారంభించారు.

ఉద్యమి భారత్ కింద మోడెం ఫ్రీ

కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నెట్ సౌకర్యం పెంచడానికి ఉద్యమి భారత్ పథకం తీసుకొచ్చింది. జిల్లాలోని పది మండలాల్లో 266 ప్రాంతాలు వీటికి ఎంపికైంది. తొలుతగా నరహరిపేట, పాలకల, తలపులపల్లె ప్రాంతాల్లో వీటిని అమలు చేస్తున్నారు. ఇక్కడ నెట్ ప్లాన్ చెల్లిస్తే చాలు ఉచితంగా మోడెం ఇచ్చి సర్వీసు అందించనున్నారు. ఇది గ్రామీణులకు ఎంతో సౌలభ్యంగా ఉంది. రూ.390తో నెలకు 1000 జీబీ డేటాను 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో, ఇంటర్‌నెట్‌తో పాటు అన్‌లిమిటెడ్ కాల్స్ ఇస్తున్నారు..